# అంతర్బుద్ధి

నేను పదే పదే నా వాదాన్ని చెప్తున్నాను, శాంతి ఒప్పుకోదు; నేను మళ్ళీ చెప్పాను:

"విను, డాక్టర్లకి ఈ శరీరం ఒక మెషినులాగ. వాళ్ళ దృష్టిలో ఎది చూసినా అది వైద్య సంబంధమైన తీరులోనే ఉంటుంది . . ఒక పేషంటుని పరీక్షించినప్పుడు అతనిలో మరేం చింతన ఉండదు . . "

మేం ఇంటినుండి బయలుదేరినప్పుడు శాంతి సరే అని ఒప్పుకున్నా డాక్టరిగారి డిస్పెంసరీకి వచ్చే దారిలో మళ్ళీ పాత ప్రశ్నలు అడగడం ఆరంభించింది. ప్రారంభంలో ఆమె తాపత్రయం, చిరచిరలాడడం నాకు ఉల్లాసంగానే కనిపించింది; నేను ఆమె మాటలని ఒక మధురమైన షెర్బత్తుని కొంచం కొంచంగా అనుభవిస్తున్నట్లు నవ్వుతూ వింటున్నాను. కాని త్వరలో ఆ మాధుర్యం తగ్గిపోయింది, నేను తాళలేక పోయాను.

మాకు పెళ్ళయి మా దాంపత్య జీవితాన్ని ఆరంభించడానికి నేను శాంతితో వచ్చిన ఈ ఊరు చాలా విచిత్రమైన ప్రదేశమే అని చెప్పాలి. ఎంతమందిని అడిగి, ఆలోచించి ఆఖరికి నేను ఇద్దరు మంచి డాక్టర్లను కనిపెట్టాను! ఒకతను డాక్టర్ రంజన్ - వయసులో చిన్నవాడే; మొహంలో ఎప్పుడూ చిరునవ్వు, అతనిది



అచ్చివచ్చిన చెయ్యి అని అందరూ అన్నారు. ఇంకొకతను డాక్టర్ రామదాసు - మంచి పేరు, వయసులో పెద్ద, అనుభవశాలి - హాస్యంగా మాట్లాడుతూ ఉంటారు. ఊరులో ఉన్న తక్కిన డాక్టరులలో ఇద్దరుకి తమ వృత్తిలో పట్టింపు లేదు; ఇంకొకతనికి ఆరోగ్యం బాగులేదు; మరొకతనికి చికిత్సకంటే డబ్బే ప్రధానం; ఆఖరికి ఒక డాక్టరు మిగిలేడు - అతని దగ్గర ఎవ్వరూ వెళ్ళరట! అతనికి పేరు యమరాజు!

నేను మొట్టమొదట శాంతితో డాక్టర్లగురించి మాట్లాడినప్పుడు డాక్టర్ రంజన్ని చూద్దామని చెప్పాను; అతని ఆసుపత్రి మా ఇంటికి దగ్గరగా ఉంది; కాని శాంతి మాకు చాలా దూరంలో ఉన్న రామదాసుని ఎంచుకుంది.

"అతనికి అనుభవం ఎక్కువ, కాదా మరి?" అని వాదించింది. నాకు తెలుసు - దాని మనసులో ఏముందని. రంజన్ వయసులో చిన్నాయన - చిలిపికొయ్య - వద్దు!

సరే, ఎలాగో, ఆఖరికి మేం డాక్టరిని చూడడానికి వెళ్తున్నాం - కాని శాంతిలో మళ్ళీ మళ్ళీ అదే ఆరాటం; నేను భరించలేకున్నాను.

" . . అవును, పేషంటుని పరీక్ష చేసేటప్పుడు డాక్టరు పేషంటుని తాకకుండా ఉండగలరా? లేకపోతే నువ్వు ఇంటిలో ఒక మూల కూర్చొని బాధ పడవలసిందే . . ఇలాగైతే నేనేమీ

చెయ్యలేను . . నువ్వు మీ ఇంటికి వెళ్ళి అక్కడ దొరికే లేహ్యమో, చూర్ణమో మింగు!" నాకు చెప్పలేని కోపం వచ్చింది.

నాకు నా స్వల్ప అనుభవంలో తెలుసు - నాకు కోపం వస్తే శాంతి నన్ను మెల్లగా ఉల్లాస మనోభావానికి తీసుకొస్తుంది. నేను ఆశించినట్లే గొంతుకమ్మిన స్వరంతో నాకు ఫిర్యాదు చేసింది: "మీకేం - అలాగే మాట్లాడతారు . .ఐతే ఒక లేడీ డాక్టరు మీ షర్టుని లాగి పారేసి మీ వీపుమీద బాది, దయ్యం లాగ మీ నోరుని తెరిచి చూపమంటే మీకు ఎలా ఉంటుంది?" అని అడిగింది.

"అలాగైతే నేను తప్పకుండా ఆనందిస్తాను . ." అని దుడుకుగా జవాబు చెప్పాను.

శాంతి ఊరుకుంది. పాపం, దానికి డాక్టరు దగ్గరకి వెళ్ళడం ఇదే మొకటిసారి, అందుకే ఇలా తహతహ పడుతోంది. ఐతే ఒళ్ళు కుదరకపోయినప్పుడు - సిగ్గు పడితే ఎలాగ? డాక్టరంటే సమ్రక్షుడు; అతని దగ్గర ఎందుకు మొహమాటం?

నేరస్తులులాగ ఇద్దరూ మాట్లాడకుండా నడిచాం; నేను ఆమెను ఓదార్చడానికి చెప్పాను: "శాంతీ, నా మాట విను: అతను గాని డాక్టరు కాకపోతే నా భార్య దగ్గర అతను రావడానికి నేను ఒప్పుకుంటానా? " అబ్బా - ఆఖరికి ఆమె సరే అని ఒప్పుకుంది! అల్లి పూవుల మొగ్గలు నీళ్ళను తాకిన వెంటనే వెల్లివిరిశినట్టు ఆమె బుగ్గల్లో కాంతి కనిపించింది.



డాక్టర్ రామదాసు నవ్వుతూ మాకు స్వాగతం ఇచ్చారు. శాంతి నాడిని పరీక్షించి మందులు రాసి ఇచ్చారు. నొప్పి వస్తే మేం తిరిగి రావాలి, అంతే . .మరేం కావాలి? శాంతి ఆనందం నిండిన హృదయంతో ఇంటికి తిరిగి వచ్చేసింది.

ఐతే రెండు మూడు వారాల్లో ఆ నొప్పి - ఆమె ఛాతిలో ఎడంపక్క -మళ్ళి రావడంతో మేం డాక్టర్ రామదాసుని చూడడానికి వెళ్ళాం. ఈ సారి శాంతి భయాలు నిజమే అని ఋజువయ్యాయి.. ఒక మృదంగ విద్వాంసుడులాగ డాక్టరు శాంతి వీపుమీద మెల్లగా - కిందా మీదా - బాదారు; ఆమెను ఒక మంచం మీద పడుకోబెట్టి ఆమె పొత్తి కడుపు, శ్వాసకోశం, హృదయం, అన్నీ పరీక్షించారు. శాంతీ ఊరటకోసం నేను కూడా ఆమె పక్కనే ఉన్నాను - కాని అక్కడనుండి మేం వెళ్తున్నప్పుడు శాంతి ఆయాసపడి ఫిర్యాదు చేసింది: " ఇదేం గొడవ? దేహంలోని నొప్పిని నిర్ణయించడానికి ఇన్ని తడబిడలా?"

ఆమె మాటలు ఎంత నిజం! మేము మూడు సార్లు డాక్టర్ రామదాసు దగ్గర వెళ్ళాం, శాంతిలో ఎటువంటి అభివృద్ధీ లేదు. ఆసుపత్రి వెళ్ళినప్పుడూ, తిరిగి వచ్చినప్పుడూ, మధ్యా, శాంతి నన్ను తన అనుమానాలూ, ఇబ్బందులూ చెప్తూనే ఉంది.

డాక్టరు ఆజ్ఞ ప్రకారం ఉదయం, సాయంకాలం శాంతి దేహంలో టెంపరేచరు నామోదు చేసాం. ఆ చార్టు చూసి డాక్టరు నాకు చెప్పారు: "ఇది చూస్తే మీ భార్య దేహంలో ఎప్పుడూ జ్వరం ఉన్నట్లు కనిపిస్తోంది; ఇదేదో మనం చూడాల్సిందే . ."

శాంతికి ఇవేమీ నచ్చలేదు. " ఇక ఈ నొప్పి వస్తే నేను ఏమీ చెప్పకుండా ఊరుకుంటాను; రెండు రోజుల్లో సరైపోతుంది. ఏ మందూ, డాక్టరూ నాకు వద్దు," అని వీరాంగనలాగ మాట్లాడింది.

కాని ఆ నొప్పి మళ్ళీ రాగానే, ఒక రోజుమాత్రమే ఆమె దాన్ని భరించింది; ఆ తరువాత ఆమె మొండితనం, ధైర్యం, నిశ్చలత మాయమయ్యాయి. నొప్పి ఆగనే లేదు. శాంతికి ఒళ్ళంతా సలుపు; ఎంత గింజుకున్నా లాభం లేదు; ఉత్తికే కూర్చోవాలన్నా, నిద్ర పోవాలన్నా  చేత కాదు. కలవరపడి నేను డాక్టరు కోసం పర్తుగెత్తాను. అతను ఊరులో లేరు. ఇతే అందువలన నేను పెర్రివాడులాగ ఉత్తి చేతులతో ఇంటికి తిరిగి పెళ్ళానా? ఎందుకు డాక్టర్ రంజన్ని పిలవకూడదు?

దీపం పెలుతురులో నా పక్కన నిలుచొని ఉన్న యువకుని - అతను డాక్టరు అని అతని చేతిలో ఉన్న హేండ్బేగ్ చెప్తోంది - చూసి శాంతికి ఒకటే పిడ్డూరం! కాని బాధలో అవస్థపడుతుంటే ఆమె మొహంలో ఎలా అనిష్టత కనిపిస్తుంది?



ఆమె నాడిని పరీక్షించిన ఒక నిమిషంలోనే శాంతి అరోగ్యం గురించి డాక్టర్ రంజనికి అంతా బోధపడినట్లుంది; ఆమె వీపు, నోరు, శ్వాసకోశం, పరిశోధన చేసారు. నాకు ఒక తైలం పేరు రాసి ఇచ్చారు. నొప్పి ఉన్న జాగాలో దాని మర్ధనం చెయ్యమన్నారు; రేపు మళ్ళీ వచ్చి చూస్తానన్నారు.

"డాక్టర్ గారూ, ఈ నొప్పి తగ్గడానికి ఏమైనా మందు ఇస్తారా? నేను రాత్రి నెమ్మదిగా నిద్రపోవాలి," అని శాంతి అతన్ని బతిమాలింది.

"తప్పకుండా? ఇప్పుడే మూర్తిగారికి పంపిస్తాను. మీకేం కష్టం ఉండదు, " అని అతను ఆమెకి ఇంపుగా జవాబు చెప్పారు. నేను అతన్ని సాగనంపాను.

ఆ తరువాత రెండు మూడు రోజుల్లో శాంతి ఆరోగ్యంలో అభివృద్ధి కనిపించింది. కాని ముందు అనుభవించిన జ్వరం, పీకు వల్ల ఆమెలో ఉన్న అలసట, బలహీనత తగ్గలేదు.

" డాక్టర్ రామదాసు తిరిగి వచ్చేసారని విన్నాను, అతన్ని పిలవమంటావా? అతను ఊరిలో లేనప్పుడు నువ్వు ఎలాగ కష్టపడ్డావని అతనికి తెలియవద్దూ?" అని శాంతిని ఒక రోజు అడిగాను.

"ఎందుకండీ? ఇవాళ పొద్దుటేగా ఇంకొక డాక్టర్ వచ్చి చూసారు? " అని శాంతి గొణుక్కుంది. అవును, ఆమె చెప్పినది

నిజమే: రంజన్ కూడా తన వృత్తిలో రామదాసుకి ఏమీ తగ్గిపోలేదు. ఒకే చికిత్సకి ఇద్దరు డాక్టర్లు ఎందుకు?

కాని కొన్ని వారాల్లో ఆ ఉపద్రవం మళ్ళీ శాంతిని పీడించింది. ఆమెకి సహించలేని బాధ. "ఇదిగో, డాక్టరుని తీసుకొస్తాను," అని అంటూ షర్టు మీద అంగోస్త్రం వేసుకున్నాను.

"ఏ డాక్టరు?" అని శాంతి పెదిమలు బిగించి, కన్నులు తెరిచి అడిగింది.

"నేనేం మరచిపోలేదు; కొంచం ఎక్కువ దూరం నడవాలన్నా పరవాలేదు. నేను డాక్టర్ రామదాసుని తీసుకొని వస్తాను," అని అన్నాను.

"అతని దగ్గర ఫీజు ఎక్కువ. డాక్టర్ రంజన్ని పిలవండి . " అని శాంతి అన్నవెంటనే నేను నమ్మలేకపోయాను: 'ఇవి శాంతి చెప్పే మాటలేనా?'

" శాంతీ, డాక్టర్ రామదాసు మనగురించి ఏమనుకుంటారు? అతను ఇప్పుడు ఊరులో ఉన్నారు కూడా! ఒకే డాక్టరైతే నీ ఆరోగ్యంలో చిక్కు ఏమిటని మనకి బాగా తెలుస్తింది కదా?" అని అడిగాను.

"సరే, మీ ఇష్టం." అని శాంతి ముక్తసరిగా చెప్పింది.

డాక్టరు రామదాసు ఆసుపత్రికి వెళ్తున్నప్పుడు నేను శాంతి ప్రవర్తన గురించి ఆలోచించాను: డాక్టరు రామదాసు వద్దు అని



ఆమె చెప్పడానికి అతని ఫీజే నిజమైన కారణమా? "సరే మీ ఇష్టం," అని అన్నప్పుడు ఆమె స్వరంలో ఒక విధమైన అతృప్తి గూఢంగా కనిపించలేదూ? ఆమె ఎందుకు తన ఇష్టాన్ని నొక్కి వక్కాణించలేదు? మరేం లాభం లేదనే రాజీ పడిందా? నాకు తెలుసు నేను చేసేది సరైన పనే - మా మొదటి choice డాక్టరు రామదాసే కదా?

దీనికి ముందు డాక్టర్ రామదాసు ఊరులో లేరని తెలియగానే నేను బాధ పడేవాడిని; సరే ఇక ఏంచెయ్యాలి అని ఆలోచించేవాడిని. కాని ఇప్పుడో? నాకు ఒళ్ళంతా ఒకటే మంట! గత్యంతరం లేక ఈ గడ్డం లేని యువకుడు రంజన్ని పిలవాలి; అతని లక్షణమైన, అందమైన మొహం నాకు ఇప్పుడు అసహ్యంగా కనిపిస్తోంది . .

డాక్టర్ రంజన్ని మళ్ళీ ఇంటిలో చూసి శాంతికి ఆశ్చర్యమే! పెదిమలలో ఆ చిరునవ్వు . . అదేం డాక్టరుకి తన కృతజ్ఞత చూపే చిహ్నమా లేక నాతో, "నేను చెప్పినది మీ ఇష్టం అని - కాని ఆఖరికి మీరు చేసినది నా తృప్తికోసం. మీరు నా బానిస!" అనే సందేశమా? ఇప్పుడు ఆమె నొప్పితో బాధ పడుతున్నట్లు ఏ గుర్తూ కనిపించలేదు.

కాని నా దిగ్భ్రమ ఎంత సేపో లేదు; శాంతి మూతి ముడుచుకొని ఉన్న తీరు, డాక్టర్ రంజన్ నిదానంగా, పద్ధతి

ప్రకారంగా ఆమెను పరీక్షించిన వాటం చూసిన తరువాత నా మనసులోని ఆవేదన మెల్ల మెల్లగా అణగిపోయింది.

మరు నాడు పొద్దున్నే డాక్టర్ రంజన్ వచ్చి తన అభిప్రాయం చెప్పేసారు: " మీ భార్య జ్వర లక్షణాలు చూస్తే ప్లూరసీ వ్యాధి అనవాలు కనిపిస్తోంది. కాని ఏం భయం వద్దు. తగిన ఆహారమూ, ఆరోగ్యకరమైన ఆచారలతో తప్పక ఆమెకు స్వస్థత కలుగుతుంది," అని చెప్పి ఇక కావలసిన మందులూ, వాటి మోతాదులూ, ఆహార నియమాలూ - అన్నీ రాసి నాకు అందించారు.

మూడు మాసాలుగా మా ఇంట్లో వంటకి ఒక అబ్బాయి ఉన్నాడు; అందువల్ల నేను వంట గురించి కంగారు పడలేదు; నా ఆదుర్ద అంతా శాంతి డాక్టర్ రామదాసుగారి మాట వింటుందా లేదా అనే.

"డాక్టరు రామదాసు వారాలకొద్దీ పరిక్ష చేసి ఏమీ తెలియక తికమకలు పడుతుంటే ఈ డాక్టరు రంజను కొన్ని రోజుల్లో తనకి నీ ఆరోగ్యం గురించి అంతా తెలిసిపోయిందని అంటున్నారు; మందులు కూడా రాసి ఇచ్చారు; మరి ఇతని మాటే విందామా?" అని శాంతిని అడిగాను.

"మరి రామదాసు లాగ ఇతనుకూడా నా temperature chart, జ్వర లక్షణాలూ చూసే నా అరోగ్య స్థితిని తెలుసుకున్నారు; ఇందులో ఎటువంటి ఇంద్ర జాలం లేదు. ఇంతకీ ఇద్దరు డాక్టర్లు చెప్పిన మందులూ, మోతాదులూ, ఒకేలాగ ఉన్నాయిగా . ." అని



శాంతి చమత్కారంగా బదులు చెప్పింది - తనకి డాక్టర్ రంజన్ మీద పక్షపాతం లేదు అని నిరూపిస్తున్నట్లు. ఆఖరికి తనే మళ్ళీ చెప్పింది: "మనకి డాక్టర్ రంజనే చాలు."

'ఇదేం మాట శాంతి? అవాళ మనం డాక్టర్ రామదాసుని చూడాడానికి వెళ్ళినప్పుడు నువ్వు నన్ను ఎన్ని ప్రశ్నలు అడిగావో గుర్తు ఉందా? మరి ఇప్పుడేమో డాక్టర్ రంజను ఏది చెప్పినా అది వేదవాక్కు అని అంటున్నావ్ . . ' అని ఆమెని అడగాలని అనుకున్నా నా నోటినుండి మాటలు రాలేదు. అలాగ అడిగి ఉంటే ఆ తరువాత నేనే దానికోసం సిగ్గుపడి ఉంటాను.

మేం డాక్టర్ రంజన్ చెప్పినట్టే చేసాం. నేను ప్రతిదినం శాంతిని అతని ఆసుపత్రికి సూదిమందుకోసం తీసుకొని వెళ్ళాను. క్రమంగా శాంతి బుగ్గలు లావుగా, గులాబి రంగుతో కనిపించాయి. నాకు మాత్రం హృదయంలో ఒక ముళ్ళు గీకుతున్నట్లు అనిపించింది.

నేను ఆలోచించాను: నేనే కదా మొట్టమొదట డాక్టర్ రంజన్ దగ్గర వెళ్దామని అన్నాను; కాని శాంతి అనుభవశాలి ఐన రామదాసు కావాలంది. ఇక సంఘటనలు సమగ్రంగా కొనసాగి ఉంటే, నేను ఇలాగ అసూయతో, సిగ్గుమాలిన ఆలోచనలతో బాధపడతానా?

కాని ఒక రోజు - తలా తోకా లేకుండా శాంతి చెప్పిన ఉదాహరణ నేను విన్నాను:

"డాక్టర్లు ఈ సమాజానికి తప్పనిసరిగా కావాలి! రాత్రి పగలూ పాటుబడి మనుషుల బాధను తీర్చడానికి వాళ్ళు ఎంత కష్టపడుతున్నారు! అదే వారి లక్ష్య సాధన!"

ఆ మాటలు నాకు వినోదంగానూ, మితి మీరిన పొగడ్తగానూ అనిపించాయి.

ఒక నాడు డాక్టర్ రంజన్ని చూసి ఇంటికి వచ్చేటప్పుడు నేను అన్నాను: 'సిన్న బజారులో నేను డాక్టర్ రామదాసుని చూసాను; నాకు ఒకటే కంగారు - అతను నన్ను ఏమైనా అడుగుతారేమో అని."

"అతనేం అడుగుతారు మిమ్మల్ని? మనం ఎందుకు అతన్ని మళ్ళీ ఎందుకు పిలవలేదు అనా? పోనీ, అలా అడుగుతే రంజన్ మీ పాత కాలేజి మిత్రుడు అని చెప్పేయండి," అని చల్లగా చెప్పింది.

మిత్రుడా? ఇంకా చెప్పాలంటే నా విరోధి! కాలేజి మిత్రుడని ఆమెకోసం నేను అబద్ధం చెప్పాలట!

శాంతి తీరు నాకు బోధపడటం లేదు. సరే, వేరే కుయుక్తి ప్రయోగించాను: "శాంతి, ముందు ఇదే డాక్టర్ రంజన్ని చూద్దామని నేను అన్నప్పుడు నీకు ఎలాగ ఉండేది? ఎంత ఆగ్రహం! ఎంత ఉక్రోషం! అవన్నీ ఇప్పుడు ఏమయ్యాయి? దేవుడా, ఆడవారి మనసంటే



ఇంత చంచలమా?" ఎలాగైనా - మెల్లిగా, కటువుగా, చమత్కారంగా, లేక కొంటెగా - మాట్లాడి ఆమె అంతరాత్మలో ఏముందో తెలుసుకోవాలని నా కోరిక; కాని ఆమె చేసేదంతా - మళ్ళీ, మళ్ళీ ఇంపుగా నవ్వడమే!

బరువు తాళలేక అల్లాడే కాగితంలాగ నా హృదయం గడగడమని వణికింది. శాంతికీ నావంటి ప్రశ్నేనా? ఆమెకి నన్ను వదలి పారిపోవాలని తలపా?

ఒకరోజు శాంతి కనుసైగ చేస్తూ నాతో, " నేను డాక్టర్ల గురించి ఒక పరిశోధన చేసాను . . . . ." అని ఆరంభించింది.

"భలే, భలే, డాక్టర్లు మందులూ, వ్యాధులూ పరిశోధన చేస్తారు; నువ్వు - వాళ్ళు చెప్పే మందులు తీసుకొనే పేషంటు - వాళ్ళనే పరిశోధన చేసావన్నమాట! సరే చెప్పు, నువ్వేం కనిపెట్టావ్"

" నేను మాట్లాడుతున్నది ఒక పరిశోధక వ్యాశం; ఉత్తికే దాన్ని ఆశు కవిత్వంలాగ చెప్పమంటే ఎలాగ? ఇదిగో, నేను ఏం రాసేనో చదివి చూడండి . ." అని అంటూ శాంతి నా చేతికి ఒక పత్రం అందించింది.

నేను చదివాను:

*"డాక్టర్లలో రెండు విధాలు; ఒక రకం భ్రష్టులు, దుష్టులు; ఇంకొక రకం ప్రసాంత హృదయులు, తమ భావవేగాన్ని తామే*

అదుపులో ఉంచుకొనే వ్యక్తులు. కాని ఈ ఇద్దరు రకాలూ - ప్రారంభంలో - ఒకరిలో ఒకరు సులభంగా కలిసిపోతారు. ఐతే ఈ రెండు తరహాల్లో ఎక్కువ భేదం లెదు; మొదటి గుంపులోవారికి మానవ శరీరం ఒక బొమ్మలాగ, అది ఒక ఆట వస్తువు; మరొకరికి అది ఒక ప్రతిచ్ఛాయ, నీడ. ఐతే ఇద్దరికీ ఈ దేహమూ, రక్తమూ ఉత్తి యంత్రమే . ."

దాన్ని - ఒక రెండు సార్లు - చదవగానే శాంతి సృష్టించిన ఆ వికారమైన చిత్రం ఆమెకున్న కల్పనా శక్తిని నాకు బాగా తెలియపరచింది. " శాంతి, పెద్ద పెద్ద ప్రొఫెసర్లు రాసే గూఢమైన సిద్ధాంత వ్యాశాలులాగే ఇది కుడా వినోదంగా ఉంది, " అని అన్నవెంటనే నాలో ఒక ఆశ: ' ఈ రెండు రకాల్లో రంజన్, రామదాసు ఎలాగ పోల్చుకోడం?'

"శాంతీ, నేను కూడా పరిశోధన చేసి ఒకటి కనిపెట్టాను," అని అన్నాను. శాంతి కళ్ళు తెరిచి నన్ను ఆశ్చర్యంతో అడిగింది.

"ఏమంటున్నారు మీరు, చెప్పండి" అని చిరాకుతో అడిగింది.

"నీకు నళాయణి కథ తెలుసుకదా? ఆమె తను ప్రేమించే తన రోగి భర్తను ఒక గంపలో అన్ని చోట్లా మోసుకొని వెళ్ళిందట; నేను కూడా అలాగే నిన్ను ఈ డాక్టర్ల దగ్గర తీసుకొని వెళ్తున్నాను . ."



శాంతికి పట్టరాని కోపం వచ్చింది. 'ఏమిటా మాటలు? మీరేమంటున్నారు? నా వ్యాధీని నళాయణి భర్త వ్యాధితో ఎలా సరిపోల్చడం? రెండూ ఒకటేనా? డాక్టర్కీ రంకుముండకీ భేదం లేదా?" ఆవేశంతో ఆమె నోటినుండి మాటలు వెలువడ్డాయి.

"మంచి పోలికే! జోస్యులు జాతకాల్ని పరిశీలించి అనుకూల్యం చెప్పినట్లు . . ." అని నేను కసి తీర్చుకున్నాను.

" ఓ, అలాగా?" శాంతి శరీరం ఆవేశంతో వొణికింది. తొందరగా తను దువ్వుతున్న జుత్తుని ఒక జడ ముడిగా కట్టి - నా దగ్గరకి వచ్చింది.

"మీకు రంజన్ అంటే అసహ్యం; నాకు రామదాసంటే అసహ్యం. ఇదెలాగ మీకు చెప్పడమనేదే నాకు ఒక పెద్ద ప్రశ్న! ఈ మధ్య మీరు మొహం ముడుచుకోడం, చిరచిరలాడడం నేనూ చూడలేదనుకున్నారా? ఇక ఆలస్యం వొద్దు, నేనే అంతా చెప్పేస్తాను . ."

ఇదేం అంటోంది? ఇప్పుడు ఏ కొంప మునిగిందని? మేమేం పెద్ద ప్రమాదంలొ చిక్కుకున్నామా - లేక అఘాతంలో పడిపోయామా?

శాంతి తన స్వరాన్ని కొంచం తగ్గించి మాట్లాడింది.

"వయసుకీ మనిషి గుణానికి ఎటువంటి పొత్తూ లెదు. రామదాసు పెద్దవారే; అతను ఒక సీనియర్ డాక్టరు. రంజన్

యువకుడు, ఒక జూనియర్ డాక్టరు. - కాని అతనికి పెద్ద మనసు, అతను యోగ్యుడు. ఇక ఆ సీనియర్ డాక్టరుకి మనసు చిన్నది; అతను ఒక సిగ్గుమాలిన మనిషి."

ఇదేం పొడుపు కథ నేను వింటున్నాను? నాలుగు సార్లు చూసి ఈమెకు రామదాసు వ్యక్తిత్వం పూర్తిగా తెలిసిపోయిందా? నా కళ్ళకి ఇద్దరు డాక్టర్లూ ఒకేలాగ కనిపిస్తున్నారే?

శాంతి మాటలు మెరుపులాగ గాలిని చీల్చాయి: "నాకు మొదటినుండే రామదాసు మొహం నచ్చలేదు - కాని అక్కడ పెళ్ళైనతరువాత నేను నా అణిష్టత దాచుకున్నాను. డాక్టర్ రంజన్ని చూడగానే ' ఎందుకు ఇతనికి ఏమీ తెలియదు - అనుభవం లేని డాక్టరు? అని తొందర పడ్డాను అని నొచ్చుకున్నాను."

ఇప్పుడే నేను నన్ను సముదాయించుకొని నవ్వుతూ అడిగాను: "డాక్టర్ రామదాసు నిన్ను ఏం చేసారు? కన్ను కొట్టారా . .లేక కామ దృష్టితో . . .."

"అవన్నీ నన్ను అడక్కండి. కాని ఒక క్షణంలో నేను డాక్టర్ రామదాసుని తెలుసుకున్నాను. మీకు రంజన్ ఇష్టం లేకపోతే నేను మా ఊరికి వెళ్ళి రంజన్ చెప్పిన సూది మందులు వేసుకొని వస్తాను . . అబ్బా, ఈ మగవాళ్ళు! పెళ్ళానికి ఆరోగ్యం బాగా లేదంటే అసలే చిరాకు పడతారు; ఇక అసూయ, అనుమానం వస్తే



ఆ తికమకలో వాళ్ళ దాంపత్యం ఎంత గందరగోళం అవుతుందో ఎవరు చెప్పగలరు? . ."

నా మనసులో శాంతి; నా అంతరాత్మలో జ్వరం తగ్గింది. సంతోషంతో నా దేహమంతా చెమట - మలేరియా రోగం నుంచి విముక్తి లభించినప్పుడు రోగి చెమట కారుస్తున్నట్టు.

"సరే, నువ్వు నీవన్నీ pack చేసుకొని సోమవారం ప్రయాణానికి రెడీ అవ్వు, " అని అంటూ నేను కూడా నవ్వేసాను.

శాంతికూడా కన్నులలో కాంతి, బుగ్గలలో చిరునవ్వుతో గభ గభ మని తన జుత్తు ముడిని విదిలించుకొని - దాన్ని మళ్ళీ దువ్వి, జడగా వేసుకుంది. నాకు అదే ఇష్టమని ఆమెకు తెలుసు.

మా ఇద్దరిలో రాజీ పడుతున్నట్లు ఏమైనా చెప్పాలనే భావంతో నా పెదిమలవరకూ మాటలు వచ్చేసాయి: "శాంతీ, అసలు ఆ వెధవ నిన్ను ఎలాగ అవమర్యాదతో చూసాడు?" కాని శాంతి నాకు బదులు చెప్తుందా? " నాకు తెలుసు," అని ఊరికే అంటుంది.

ఇప్పుడే నాకు బోధపడింది. ఇన్ని రోజులూ శాంతి అంతర్బుద్ధి ఆమెకు తోడుగా నిలబడింది. అదే అంతర్బుద్ధి నన్ను కాపాడింది: శాంతి నిజమైన స్వరూపాన్ని, నిష్కళంక మనసుని, నేను చూడకలిగాను. డాక్టర్ రంజన్ని మొట్టమొదట చూసినప్పుడు తనకు అతని మీద మోజు కలిగిందని ఆమె చెప్పింది; కాని నా

అంతర్బుద్ధి నాకు చెప్తోంది: శాంతిలో ఏ కళంకమూ, దోషమూ, లేదు.

పుస్తకాలన్నీ చదివి, జీర్ణం చేసుకొని వ్యాధులని తీర్చే డాక్టరు కంటే అంతర్బుద్ధితో సరిగ్గా వ్యాధి నిర్ణయం చేసేవారు ఈ సమాజానికి సమరక్షకులు. నా అంతర్బుద్ధి నాకు రహస్యంగా చెప్పింది: మా ఇద్దరి మనుసులు -మధురమైన ప్రేమలో ఏకమై - ఒకే స్వరంతో మ్రోగుతున్నాయి..

*******